# కాల్తున్న మనుషులు

క్రమల మనసులో ఆ భావం తళుక్కున మెరిసింది. కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్న ఆమె - ఎవరో తనను కమ్చీతో కొట్టినట్లు లేచికూర్చుంది. కలలోంచి మెలకువ వచ్చినట్టుగా అనిపించింది. కాని అది కల కాదు.

కలరావడానికి ఆమె అసలు నిద్రపోవడం లేదు. మెలుకువగా ఉండగానే, ఆమెకు తెలియకుండానే ఆమె మనసులో మెదిలిన ఆలోచన అది.........ఆ స్థితిని సబ్ కాంషన్ స్టేట్ అంటారో, ఏమంటారో ఆమెకు తెలియదు.

ఆమె తత్తరపడింది. ఆందోళన చెందింది. గుండె వేగం హెచ్చింది. 'ఛీ ఏమిటిలా ఆలోచిస్తున్నాను.' అనుకుంది. రవిక లోంచి మంగళసూత్రాలు తీసి కళ్ళ కద్దుకుంది. దేవుని పటం వైపు తిరిగి కళ్ళుమూసుకుని ప్రార్థించింది.... కీడు శంకించకూడని మనిషి.... ఈ వ్యవస్థలో పుట్టి, పెరిగి, బతుకుతున్న ఆడది....

* * *

కమల రాత్రి పగలు కూడా వికసించే కమలంగా అందంగా ఉంటుంది. బి. యస్సీ. చదువుతున్న రోజుల్లో ఎంతో మంది విద్యా

ర్థులు ఆమెను మౌనంగా ఆరాధించేవాళ్ళు... ఆమె అందాన్నే కాదు.... ఆమె తెలివితేటల్ని, ఆమె ప్రవర్తనను....ఆమె నడవడికను....

బి. యస్సీ. పాసవగానే ఆమెకు సంబంధాలు చూడటం మొదలు పెట్టాడు ఆమె తండ్రి గిరిజాపతిరావు గారు.

ఆయనకి డబ్బుకన్నా, మనిషికన్న విలువ ఎక్కువని గొప్ప అభిప్రాయం. అంచేత డబ్బున్న సంబంధం కంటే— చదువుకుని ఉద్యోగం చేసుకునే సంబంధం చెయ్యాలని ఆయన ఆలోచన.

ఆయన ఉద్దేశ్యంలో తన కూతుర్ని ఎవడు చేసుకున్నా ఆమె చేతిలో సుఖపడతాడు. కాకపోతే ఆమెకు సుఖపెట్టే కుర్రాడు కావాలి.

మనిషి డబ్బువల్లే సుఖపడతాడని, సుఖపెడతాడని ఆయనకి నమ్మకం లేదు. అంచేత కూతుర్ని వేలువేలు తెచ్చుకునే ఉద్యోగస్థుడికి మాత్రమే చెయ్యాలని ఆయన అనుకోలేదు. తన కుటుంబపు కనీసావసరాలు చూసుకునేవాడై, సంస్కారం, అభిమానం వున్నవాడైతే చాలనుకున్నారు. అల్లుడు తన కూతుర్ని విమానాల్లోను, కార్లలోను తిప్పాలని, ఆమెచేత ఫ్రిజ్‌లో నీళ్ళు మాత్రమే తాగించాలని ఆయన అనుకోలేదు. తన కూతురికీ అల్లాంటి భోగాలు అమర్చలేక పోయానని ఆయనకు తెలుసు. అవన్నీ అల్లుడు అమర్చాలనుకోడం అత్యాశ అవుతుందని ఆయన భావన.

కమల స్పందన ఉన్న మనిషి. ఆమెను అర్థం చేసుకునే మనిషైతే చాలు.

పూర్ణచంద్రరావు ఎం. కాం. పాసయ్యాడు. హైద్రాబాద్‌లో ఓ గవర్నమెంటు కంపెనీలో ఎకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. అతను పగలుకూడా ఉదయించే చంద్రుడిలా హుషారుగా వుంటాడు. స్వంత కిరణాలతో ప్రకాశించే చంద్రుడులా ఆనందంగా ఉంటాడు. ప్రపంచంలోని బాధలు తెలియనట్టుగా అతని ముఖం వెలుగుతూ వుంటుంది. అతన్ని మిత్రులంతా చంద్రం అని పిలుస్తారు.

అతనికి కమల నచ్చింది....

ఆమెను చూసిన పది నిముషాలకే అతనా విషయం చెప్పేశాడు.

"నీకు నచ్చాడామ్మా?" కూతుర్ని గదిలోకి పిలిపించి అడిగాడు గిరిజాపతిరావుగారు.

"నీ ఇష్టం నాన్నా!" అంది కమల.

"అలా కాదు. నువ్ చిన్నపిల్లవికాదు, మంచి, చెడ్డ, ఇష్టం, అయిష్టం విడమర్చి చూడగల వయసొచ్చింది. పైగా చదువుకున్న దానివి. నీ అభిప్రాయం స్పష్టంగా చెప్తేనే ఈ సంబంధం ఖాయం చేస్తాను. నా అభిప్రాయాల్ని, ఇష్టాల్ని నీ మీద రుద్దడం నా కిష్టం లేదు."

తండ్రి మాటలకు కమల నవ్వింది

ఆ నవ్వులో ఆయన అభిప్రాయం ఆమెకు సగం అర్థమై పోయింది.

"అతని చదువు, ఉద్యోగం నీకు నచ్చింది. మనిషి రూపం అంటావా ? ఏ రకంగా చూసినా అతను నాకన్నా అందగాడు.... నాకిష్టవేఁ...." అంది కమల.

కమల చంద్రుడి జీవితంలో ఒదిగిపోయింది.

కమల తన భర్తనుంచి గాఢంగా కోరుకున్న దొక్కటే.... కష్టం, సుఖం తనతో సమానంగా పంచుకోవాలని.... అతనితో అలా పంచుకోడానికి ఆమె సిద్ధమే....

వాళ్ళ దాంపత్య జీవితం బాగానే మొదలయ్యింది.

ఆమెకు ఉదయాలు ఆహ్లాదంగానూ, సాయంత్రాలు ఆనందం గాను కనిపించేవి– అనిపించేవి....

తనకిష్టమైన లేత నీలంరంగు అతని కిష్టంలేదంటే ఆమె బాధ పళ్ళేదు. అతని కిష్టమైన కెంపురంగునే తనూ ఇష్టపడటం మొద

లెట్టింది.... కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావుల కవిత్వం గురించి మాట్లాడినప్పుడు "వాళ్ళెవరు?" అని అతనడిగితే- కొంచెం ఆశ్చర్య పోయిందే తప్ప బాధపళ్ళేదు.... ఆకాశంలోంచి వెండివెన్నెల ప్రపంచ మంతా కురుస్తున్నప్పుడు- తమ వాటాదగ్గర వున్న చిన్న వరండాలో కుర్చీలేసుకుని ఒకరిచేతిలో మరొకరి చెయ్యివేసుకుని కూర్చుందామని ఆమె ప్రతిపాదించిన రాత్రి అతను గదిలో మంచంమీద పడుకుని "నువ్ తొందరగా రా- నాకు నిద్రొస్తోంది." అనంటే కొంచెం నొచ్చు కుందే తప్ప- ఏమీ అనలేదు. తనకున్న సరదాలన్నీ ఆతనికి ఉండి తీరాలన్న రూల్లేదు— అనుకుని సమాధానపడిపోయింది.

కాని.... కాపురంపెట్టిన రెండోనెల్లో ఓరాత్రి మొగుడు ఇంటికి లేటుగా వస్తే తలుపుతీసిన కమల ముక్కుకి తగిలిన ఘాటైన వాసనకి మాత్రం కలవరపడింది. ఆందోళన చెందింది.

కమల మనస్తత్వం- సగటు ఆడదాని మనస్తత్వానికి కాస్త భిన్నమైంది. అలిగి, పోట్లాడి, రంకెలేసి, అరుచుకుని.... సమస్యల్ని ఇలా పరిష్కరించుకోడం ఆమె కిష్టంలేదు. మనిషికి నోరిచ్చినందుకు- ఒకరి అభిప్రాయాల్ని మరొకరికి చెప్పుకునేందుకు వీలుగా భాష ఉన్నందుకు.... మాట్లాడుకోవాలి.

భార్య భర్తకాని, తండ్రి కొడుకుగాని, అన్నదమ్ములు కాని.... సరే ఇద్దరు మనుషులు ఓపికగా, ఓరిమిగా మాట్లాడుకొని, తమ మధ్య సమస్యల్ని పరిష్కరించుకోవాలి.... ఒకర్నొకరు కన్విన్స్ చేసుకోవాలి.

కమ్యూనికేషన్ గేప్.... మనిషికి మనిషికి మధ్య నిశ్శబ్దం.... దీనివల్లే ప్రపంచంలో ఇన్ని అనర్థాలు, శతృత్వాలు ఏర్పడుతున్నాయని ఆమె దృఢమైన అభిప్రాయం.

ఆ రాత్రి పూర్ణచంద్రరావు స్పృహతప్పి పడిపోయేంతగా తాగక పోయినా.... అతని నడకలో, మాటలో, చేష్టల్లో తేడా స్పష్టంగా కని పిస్తోంది. భార్య ఆ విషయం ఎక్కడ ఎత్తుతుందో నన్న భయంవల్ల

నేమో.... అతను కొంచెం కోపంగా ఉన్నట్టు నటిస్తున్నాడు. ఆ విషయం ఆమెకు తెలుసు. ఆమెకి నవ్వు వచ్చింది.

భోజనంచేసి అతను పడుకున్నాక. ఆమె ఏదో పుస్తకం చూస్తూ కుర్చీలో కూర్చుంది. అతను పిలుస్తాడేమో సన్న భయం ఆమెక్కలిగింది. అతన్ని అంటరాని వాడిలా చూడాలన్న ఆలోచన కాని, అతని పక్కన పడుకో కూడదన్న నిషేధంకాని ఆమెకు లేవు.

కాని.... తీరా పిల్చి....

ఆ వాసనకి తట్టుకో లేనన్న భయం ఆమెక్కలిగింది. కానీ ఆమె అదృష్టం బాగుండి. అతను ఒళ్ళు మరచి నిద్రపోయాడు.

మర్నాడు ఉదయంలేచి ముఖం కడుక్కొని కాఫీకోసం వంటింట్లోకి రాకుండా గదిలో వుండి పోయాడు పూర్ణచంద్రరావు. కమలకి ఏదో అర్థమైనట్టనిపించింది.

కాఫీ తీసుకుని తనే గదిల్లోకి వెళ్ళింది. 'ఇదిగో కాఫీ' అంటే పేపరులోంచి తలబైటికి పెట్టకుండానే చేయిచాచాడు. కాఫీ అందించి అక్కడే మరో కుర్చీలో కూర్చొంది. అతను గమనించనట్టుగా పేపరు చదువుకుంటున్నాడు.

మెల్లగా పేపరు తీసి "సూర్యోదయమైనంత మాత్రాన చంద్రుడు ముఖం చాటు చేసుకోనక్కర్లేదు" అని అతని ముఖంలోకి గుచ్చిగుచ్చి చూసింది.

ఆమె మాటలకి అతను మెల్లగా చప్పుడు చెయ్యకుండా నవ్వాడు. ఆ నవ్వులో ఆమెకి కొంటెతనం, గిల్టీ, బాధ కనిపించాయి.

"మీరలా.... నాకిష్టంలేదు. డబ్బు ఆరోగ్యం పాడౌతాయనేకాదు నాకు భయం. చిన్నప్పుడు మీ ఇంటెదురుగా మున్సబ్‌గారబ్బాయి తాగి వచ్చేవాడు. మరీ అల్లరి చేస్తుంటే అతన్ని చితగ్గొట్టి గదిలో పెట్టి తాళం వేసేవారు. భయపడి ఇంట్లో దాక్కునేదాన్ని...."

అతను మాట్లాడలేదు. కిటికీలోంచి బైటికి చూస్తున్నాడు.

"నా అభిప్రాయాల్ని మీ మీద రుద్దడం కాదు. నా భయాన్ని బాధని మీరు అర్థం చేసుకోవాలి ప్లీజ్....మీకు చెప్పేంతదాన్ని కాక పోవచ్చు, కానీ మీతో బతకాల్సినదాన్ని....నన్ను భయపెట్టొద్దు బాధ పెట్టొద్దు"

అతను కుర్చీలో కాస్త పక్కకి జరిగాడు.

"ఎవరో ఫ్రెండ్ పార్టీకి పిలిస్తే వెళ్లాను. రోజూ తాగే అల వాటు లేదు"

అతని మాటలకి ఆమె ఆనందపడిపోయింది. అతనలా 'ఫీల్' అయితే చాలు....తర్వాత మెల్లగా నచ్చచెప్పవచ్చనుకుంది.

"లేచి స్నానం చెయ్యండి. భోజనం వడ్డిస్తాను" అంది. అతను కంపెనీకి వెడుతుంటే తలుపు వెనకాలకు తీసికెళ్ళి అతన్ని గుండెలకు హత్తుకుని -

"సాయంత్రం పెందలాడే ఇంటికి రండి. నిన్న రాత్రికి మిం చిన కిక్....'' ఆమె మాట్లాడలేక పోయింది. అతనామె పెదాల్ని తన పెదాలతో తాకి....గబ గబా వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత రోజులు గడుస్తున్న కొద్దీ-

ఎన్నో లేట్ నైట్....

ఎన్నోసార్లు మనసు బాగాలేకపోవడాలు....

• • •

సత్తిరాజుకూడా పూర్ణచంద్రరావు పనిచేసే కంపెనీలోనే పనిచే స్తాడు.... అతనూ ఆదే కాలనీలో ఉంటాడు.

సత్తిరాజు తాగుబోతని కమలకి కాపురానికి వెళ్ళిన కొత్తలోనే తెల్సిపోయింది. అలా ఆమెకు తెల్సిన ఆర్నెల్లలోనే పూర్ణచంద్రరావు,

సత్తిరాజు మంచి స్నేహితులయ్యారు.... సత్తిరాజు తమ ఇంటికి రాక పోకలు ఎక్కువ చెయ్యడంతో కమలకు ఆందోళన పెరిగింది.

పూర్ణచంద్రరావు ఇంటికి రావడం, రోజురోజుకీ ఆలస్యమౌతోంది. ఏరాత్రి ఆలస్యంగా ఆమె తలుపుతియ్యాల్సి వస్తుందో ఆరాత్రి కొంపంతా వాసన, ఘాటైన వాసన. గంధకం కాల్తున్న వాసన. మనిషి కాల్తున్న వాసన. చదువు, సంస్కారం, విజ్ఞత కాల్తున్న వాసన, ఓ భర్త తన భార్య మనసుని పెట్రోల్‌తో కాలుస్తున్న వాసన....

పెళ్ళయిన కొత్తలో కమలతో ఓ స్నేహితురాలు అంది. "హైద్రాబాద్‌లో ఉద్యోగాలు చేసేవాళ్ళంతా తాగుతారట." అని అప్పట్లో ఆమె ఆందోళన పడలేదు. ఆమెకు తనమీద, తనభర్తమీద అతన్ని కన్విన్స్ చెయ్యగల శక్తిమీద అపారమైన నమ్మకం....

కొండంత నమ్మకం మెల్లిగా, మెల్లిగా కూలిపోయింది. ఆమెకు హైద్రాబాద్ మీద కోపంలేదు. మద్యనిషేధం పెట్టని ప్రభుత్వంమీద కోపంలేదు. అవి అమ్మే కొట్లమీద, బార్లమీద కోపంలేదు. అలాంటి సంబంధం చేసిన తండ్రిమీద కోపంలేదు. తనక్కనబడని దేవుడిమీద, కనిపించే సత్తిరాజుమీద కోపంలేదు.

మన బంగారం మంచిదైతే....

అతను చిన్నపిల్లాడు కాదు. చదువుకోనివాడు కాదు.... తెలివి తక్కువవాడు కాదు, మూర్ఖుడు కాదు.... మనిషి విచక్షణా జ్ఞానాన్ని జయించగల-బలహీనత ఏదో....

"ఛీ.... నా ఖర్మ.... అనుకుంటుంది కమల.

మనిషి మరో మనిషినుంచి తెల్సుకోవల్సింది ఎంతైనా ఉంది. కాని తెల్సుకోడు.... జస్ట్ ఇన్ డిఫరెన్స్.... కాలస్‌నెస్.

తాగుడు అనర్థమని సినిమాలు చెప్తున్నాయి, పత్రికలు చెప్తున్నాయి, రేడియోలు చెప్తున్నాయి, పెద్దలు చెప్తున్నారు, పిన్నలు చెప్తున్నారు, ఆఖరికి పెళ్ళాం చెప్తోంది....

అసలు చదువుకున్నవాడికి, వయసొచ్చినవాడికి ఒకరు చెప్పాల్సిన పని లేదన్నది కమల అభిప్రాయం అయినా చెప్పింది. బతిమాలింది. బుజ్జగించింది చివరికి తన ఇష్టానికి వ్యతిరేకంగా పోట్లాడింది. పుట్టింటికి పోతానని బెదిరించింది....

"పోతే పో" అన్నాడు....

తన బలహీనతమీద ఉన్న విలువలో సగంకూడా జీవితాన్ని పంచుకున్న మనిషిమీద లేదు....

"బెదిరించిందేకాని.... మొగుడితో పోట్లాడి పుట్టింటికి వెళ్ళడం.... అందులోను యిద్దరు పిల్లలతో, వాళ్ళని చూసినప్పుడల్లా ఆమెకు గుండె తరుక్కుపోతుంది. మెదడు మొద్దుబారిపోతుంది. అవయవాలు సమ్మె చేస్తాయి.

"ఫ్రెండ్స్ బలవంతంమీద పార్టీకి" అని మొదలైనది అలవాటుగా, జీవితంలో ఒక భాగంగా అయిపోయిందతనికి....

ప్రస్తుతం అతను చిక్కి శల్యమై, అమావాస్యముందు చంద్రుడిలా నీరసంగా ఉన్నాడు. ఆమె సూర్యకిరణాల వేడికి వాడిపోయిన కమలంలా వుంది.

భర్త కళ్ళకింద నల్లటి గీతల్ని చూసినప్పుడు, బైటికొచ్చిన తన ఎముకలు కనిపించినప్పుడు, పెద్దపిల్లాడి చొక్కా చిరుగులోంచి వాడి శరీరం కనిపించినప్పుడు... తను నమ్ముకున్న భూమి తనని లాగేసుకుంటున్నట్టు, తను నమ్ముకున్న దేవతలు తనమీద నిప్పుల వర్షం కురిపిస్తున్నట్టు.... ఏదో బాధ శూన్యపు భవిష్యత్తు వెక్కిరిస్తున్నట్టుగా ఆందోళన.... ఏమీ చెయ్యలేని నిస్పృహాయత.... అంతంలేని భయం కరవు పసుగు.... అర్థం తెలియని ఆయాసం....

అర్ధరాత్రి దాటాక, తాగి తూలుతూ రావడం, స్పృహలో ఉంటే కాసిన్ని మెతుకులు కతకటం, ఇంకాస్త ఎక్కువ స్పృహలో ఉంటే ఆమె పక్కనే ఒడిగి ఒంట్లో వేడి, చల్లార్చుకోడం, మత్తుగా నిద్రపోవడం....

పెళ్ళాం తిందో లేదో అక్కర్లేదు. పిల్లలు స్కూలుకెళుతున్నారో
లేదో అక్కర్లేదు. ఆమె ప్రక్కన ఒదగడం ఆమెకిష్టమో లేదో అక్క
ర్లేదు.... పశుప్రవృత్తి, ఏనిమల్ ఇన్‌స్టింక్ట్—

మనిషికి-పశువుకి మధ్యనున్న తల వెంట్రుక వాసి గీత చెరి
పేశాడు.

ఆఫీసు నిండా అప్పులు, ఊర్నిండా అప్పులు — అప్పులు
తీర్చగా ఏమైనా మిగిలితే ఇస్తాడు. నెలంతా గడవాలి. నగరపు జీవి
తం, పెరుగుతున్న ఖర్చులు, ధరలు—తెల్లారితే ఖర్చు—

కమల కాపురానికొచ్చిన కొత్తలో సరదాకి ఎంప్లాయిమెంటు
ఎక్స్చేంజిలో రిజిస్ట్రేషన్ చేయించింది. రెన్యువల్ చేయిస్తూనే ఉంది-
అయిదేళ్ళయినా ఒక్క పిలుపూ రాలేదు. ఉద్యోగం దొరికితే కుటుం
బపు కనీసావసరాలకి ఇబ్బంది ఉండదని ఆమె ఆలోచన - -

ఆమె బెంగల్లా పిల్లల గురించి. తన జీవితం నాశనమైపోయింది.
మొగుడిదీ అయిపోయింది. తర్వాతి తరం జీవితం కూడా నాశనమై
పోతుంది. వాళ్ళకి మంచి తిండిలేక, మంచి చదువులేక వాళ్ళు భ్రష్టయి
పోతే - వాళ్ళతర్వాత తరాలు, ఆ తర్వాత తరాలు ఇలా ఎన్నోతరాలు
నాశనమైపోతాయి. ఒక్క మనిషినిచంపితే ఉరిశిక్షవేస్తారు-బాధ్యతా రహి
తంగా కుటుంబాన్ని నాశనం చేసి పిల్లల్ని పాడుచేసి - - ఆ రకంగా
తరతరాల్ని నాశనం చేసిన మనిషికి శిక్ష ఏమిటో ?

ఎప్పుడయినా తనను చూడ్డానికి వచ్చిన తండ్రిని- పిల్లలు చూడ
కుండా- కౌగిలించుకుని ఏడుస్తుంది కమల. ఆయనోరోజు వుండి,
ఐదొందలో, ఆరొందలో ఆమె చేతిలోపెట్టి వెళ్ళిపోతాడు. ప్రతిసారి
వెడుతూ "నువ్వు, పిల్లలు నాతో వచ్చేయండి. అతనికి బాగుపడ
నంతగా చెడిపోయాడు. మీకు లోటుండదు. కనీసం పిల్లలైనా కడుపు

నిండా తిని, కంటినిండా నిద్రపోతారు.... మంచి చదువైనా చెప్పిద్దాం...." అంటాడు.

"కొన్నాళ్ళు చూద్దాం నాన్నా" అంటుంది.

మొగుడు ఎలాంటివాడైనా– కాపురంలేని ఆడదని పేరు వస్తుంది.... సాంప్రదాయం రక్తంలో జీర్ణింపచేసుకున్న మనిషి.

ఎప్పటికైనా భర్త మారకపోతాడా అన్న ఆశ మినుకు మినుకు మంటూంటుంది. ఆరిపోబోయే దీపంలా—

పక్కవాటాలోని విజయలక్ష్మి కూడా అదేమాటంటూంది.... "మెల్లగా చెప్తూ వుండండి. ఎప్పటికైనా మారతారేమో"

విజయలక్ష్మి కమలకి స్నేహితురాలు ఆప్తురాలు. ఇద్దరూ కూడా కష్టాల నావల్లో ప్రయాణం చేస్తున్నవాళ్ళే. జయలక్ష్మి కమలకన్నా వయసులో కాస్త పెద్దది. ముగ్గురు బిడ్డలతల్లి.... భర్త ఏదో గవర్న మెంటు ఆఫీసులో పని చేస్తాడు. అతనికి సంవత్సరంనుంచి ముదిరి పోయిన రోగం....

వందలు, వేలు ఖర్చుపెట్టినా తగ్గలేదు. జీతం నష్టంమీద శెల వులో వున్న కారణంగా జీతం లేదు. ముగ్గురు పిల్లలతో, మందుల ఖర్చుతో, గర్భ దరిద్రం అనుభవిస్తున్నారు. తనకన్నా దయనీయ మైన పరిస్థితి జయలక్ష్మిది అనుకుంటుంది కమల. ఒకోసారి తనకన్నా జయలక్ష్మి అదృష్టవంతురాలనుకుంటుంది. భర్తకు రోగం తగ్గిపోతే మళ్ళీ మామూలుగా, హాయిగా, ఆనందంగా కాలం గడపవచ్చు.

కాని తన పరిస్థితి....

నాటుసారా తాగడానికి అలవాటుపడిపోయిన తన భర్త ఎప్పటికి మారతాడు? సాధ్యమా ?....

ఎండమావుల్లాంటి జీవితం.

జయలక్ష్మి భర్తకి మరీ రోగం ముదిరింది. వారంరోజులపాటు

హాస్పిటల్ వాళ్ళు అటా ఇటా అన్నారు. చివరికి అతను 'అవే'నని తేల్చేశాడు.

జయలక్ష్మి శోకంతో సముద్రమైపోయింది. కమల ఎంతో బాధ పడింది. తన స్నేహితురాలి ఆశాకిరణం రాలిపోయింది. ఆమె పిల్లలా పసివాళ్ళు- ఎటూ ఆదుకునే దిక్కులేదు.

ఆ తల్లి పిల్లల భవిష్యత్తు ఎలా గడుస్తుంది? కమల ఆలోచించ లేకపోయింది జయలక్ష్మికి మాటసాయం, పనిసాయం చేసిపెట్టింది. ఆమె దుఃఖంలో మునిగిపోతే- ఆమె పిల్లలకు అన్నం వండి దగ్గరుండి తినిపించింది.

* * *

మూణ్ణెల్ల తర్వాత....

జయలక్ష్మికి భర్త పనిచేసిన ఆఫీసులో ఉద్యోగం ఇచ్చారు. అతనికొచ్చిన గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్ డబ్బుతో అతని వైద్యానికి చేసిన అప్పులన్నీ తీర్చేసింది. ఆమె ఉద్యోగంచేస్తూ పిల్లలకు కడుపు నిండా అన్నం పెట్టి, స్కూలుకి పంపిస్తోంది. కమలకి సాయంచేస్తూ, ధైర్యం చెపుతూ నిజమైన స్నేహితురాలిగా ప్రవర్తిస్తోంది. తన స్నేహితురాలి ఆర్థిక సమస్యలు పరిష్కారమయినందుకు కమలకు ఆనందంగా వుంది.

ఓ రోజు మధ్యాహ్నం ఒక్కర్తీ కూర్చుని ఆలోచిస్తుంటే కమ లకు తన సమస్యకే పరిష్కారం తెలపడంలేదు. పోనీ పిల్లల్ని తీసు కుని తండ్రి దగ్గరకి వెళ్ళిపోదామా- అన్న ఆలోచన వచ్చింది. వదిన గార్లముందు తన పరిస్థితి చులకనగా వుంటుంది. తన పిల్లలు అన్న గారి పిల్లలముందు చులకనగా ఫీలవుతారు.... కాపురం ఒదులుకుని పుట్టింటికి వచ్చిన ఆడదానిగా తన పరిస్థితి....

వెళ్ళకూడదనుకుంది.

ఇంకవేరే పరిష్కారం కనబడ్డం లేదు. చుట్టూ శూన్యం .... అన్నీ చెయ్యగల మానవుడు....ఏవీ చెయ్య లేని తనం....

కమల ఆలోచిస్తోంది.... బుర్రలో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి. కళ్ళు తెరిచి చూడబుద్ధి కావడం లేదు....

మెరుపులా ఏదో ఆలోచన....

"తన భర్త కూడా చచ్చిపోతే....తనకి అదే ఆఫీసులో ఉద్యోగం ఇస్తారు. అప్పుడు....అప్పులు సమస్యలన్నీ పరిష్కారమౌతాయి. పెద్దపిల్లాడి చొక్కామీద చిరుగుచూడక్కర్లేదు. చిన్న పిల్లాణ్ణి అన్నం తిని రమ్మని జయలక్ష్మి ఇంటికి పంపక్కర్లేదు. ఫీజు కట్టలేదని వాళ్ళిద్దర్నీ టీచర్ ఇంటికి పంపెయ్యదు. తండ్రిచ్చే డబ్బు తీసుకోనక్కర్లేదు....అసలింతలా ఆలోచించినక్కర్లేదు. జీవితం ప్రశాంతంగా ఉంటుంది."

"ఛీ! ఏమిటిలా ఆలోచిస్తున్నాను." అని లేచి కూర్చుంది. పుస్తెలు కళ్ళకద్దుకుంది....ఏం లేకపోయినా ఫరవాలేదు- తిండి లేకపోయినా ఫరవాలేదు. ఆడదానికి పసుపు కుంకుమలు ముఖ్యం. ఆయన చల్లగా ఉండాలి. తాగినా ఫరవాలేదు. ఇంట్లో డబ్బు ఇయ్యకపోయినా ఫరవాలేదు. దరిద్రం అనుభవించినా ఫరవాలేదు. అయన చల్లగా వుండాలి. ఎల్లకాలం బతికుండాలి." అనుకుంది. వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంది.

ఆ తర్వాత పదిహేనేళ్ళుగా ఆమె అలా అనుకుంటూనే ఉంది. దేవుళ్ళు ఆమె మొర ఆలకిస్తూనే ఉన్నారు. ఆమె ఇంట్లో మాత్రం ప్రతిరాత్రి వాసన, ఘూటైన వాసన, గంధకం కాల్తున్న వాసన, మనిషి కాల్తున్న వాసన, మొగుడు పెళ్ళాం బిడ్డల్ని పెట్రోలు పోసి, ఆల్కహాల్ పోసి కాలుస్తున్న....వాసన.

— "స్వాతి" నవంబర్ 1981